క్లుప్తంగా

సర్వే వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని కమిషనర్ మోహన్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. తప్పులకు అవకాశం లేకుండా వేగవంతంగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా పదో వార్డులో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ



చెక్కు అందిస్తున్న దావ వసంత

జగిత్యాలరూరల్: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ నిరంతరం అండగా ఉంటుందని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త మెడపట్ల లక్ష్మణ్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యకర్తలు నిరంతరం పార్టీ అభ్యున్నతికి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరావు, తిరుపతి, సురేందర్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘానికి రేషన్ షాపు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో మహిళా సంఘానికి రేషన్ షాపు మంజూరు చేయాలని సోమవారం ప్రజావాణిలో స్వశక్తి మహిళా సంఘ సభ్యులు తహసీల్దార్ ప్రసాద్‌కు విన్నవించారు. గ్రామంలో గ్రామాఖ్య సంఘంలో తీర్మానం చేసి, తీసుకవస్తే పై అధికారులకు పంపిస్తానని తహసీల్దార్ వారికి తెలిపారు. కార్యక్రమంలో మహిళ సంఘం అధ్యక్షుడు తేలు హారిక, సభ్యులు, ఎంపీడీవో చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ సిబ్బంది

సారంగాపూర్: సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో జన్ సురక్ష సాచురేషన్‌లో భాగంగా సోమవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ ప్రేమానంద్, ఫీల్డ్ ఆఫీసర్ దత్తాత్రేయ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఆఫర్లతో మెసేజ్‌లు పంపినా వాటిని ఓపెన్ చేయవద్దని, పాస్‌వర్డ్, పిన్ నెంబర్, ఓటీపీ నంబర్ వంటి వివరాలు అడిగినా సమాచారం ఇవ్వవద్దని సూచించారు. బ్యాంక్ లావాదేవీలను ప్రతి వినియోగదారుడు గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫైనాన్షియల్ లిటరసీ సంస్థ సభ్యులు సోగాల విజయ్‌కుమార్, ముద్దం వనజ, మడ్డి ప్రశాంత్, సెర్ప్ సీఏ మమత ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రాయికల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సుధీర్‌రావు అన్నారు. సోమవారం రాయికల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సైబర్ నేరాల నియంత్రణ కో–ఆర్డినేషన్ సెల్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సోషల్ మీడియాను పరిమితంగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవేందర్, ప్రోగ్రాం కన్వీనర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలగానే మినీ స్టేడియం

- రూ. 2.65 కోట్లు మంజూరు
- గణేశ్‌పల్లిలో స్థల సేకరణ
- టెండరు పూర్తయినా ప్రారంభం కాని పనులు
- క్రీడాకారుల ఎదురుచూపు



గణేశ్‌పల్లిలో మినీ స్టేడియం ఏర్పాటుకు సేకరించిన స్థలం

సారంగాపూర్: ఉమ్మడి సారంగాపూర్ మండలంలో క్రీడాకారుల కోసం ఎనిమిదేళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన మినీ స్టేడియం పనులు ముందుకు సాగడం లేదు. రెండు మండలాల్లో జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఆడే క్రీడాకారులు అప్పటి ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో మినీ స్టేడియం ఏర్పాటు తెరమీదికి వచ్చింది. మినీ స్టేడియం సారంగాపూర్ మండలం పోతారంలోని గణేశ్‌పల్లిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. టెండర్లు పూర్తయినా పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు.

ఆరెకరాలు సేకరణ

సారంగాపూర్ మండలంలోని పోతారం శివారు గ్రామం గణేష్‌పల్లిలో మినీ స్టేడియం ఏర్పాటుకు 2016–17 సంవత్సరంలో ప్రతిపాదించారు. గ్రామ శివారుల్లో 6.05 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సేకరించి, 2022–23లో రూ. 2.65 కోట్లతో స్టేడియం నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఈఎన్‌సీకి అప్రూవల్ పంపారు. ఏడాది క్రితం నిధులు మంజూరు కాగా, అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసారు.

మినీ స్టేడియం స్వరూపం

మినీ స్టేడియంలో అవుట్‌డోర్, ఇండోర్ గేమ్స్‌లో భాగంగా వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, టెన్నిస్, కబడ్డీ, బ్యాడ్మింటిన్(షటిల్) వంటి క్రీడలతో పాటు, స్విమ్మింగ్‌పూల్‌ను ఏర్పాటు చేయనున్నారు. స్టేడియం నిర్మాణంలో పెవిలియన్ బిల్డింగ్‌తో పాటు, ఇండోర్ హాల్ నిర్మాణం చేపట్టనున్నారు..

పనుల జాప్యానికి కారణం

పనులు నిర్వహించడానికి పనులకు సంబంధించి టెండరు పొందిన కాంట్రాక్టరు పనులు పూర్తి చేస్తే సకాలంలో బిల్లులు అందుతాయో లేదో అనే అనుమానంతో కొంత వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు సకాలంలో డబ్బులు అందుతాయని భరోసా కల్పిస్తున్నప్పటికీ కాంట్రాక్టర్ వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీ స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

క్రీడాకారులు వెలుగులోకి వస్తారు



మినీస్టేడియం గణేశ్‌పల్లిలో ఏర్పాటు జరిగితే సారంగాపూర్ మండలంలోని క్రీడాకారులతో పాటు, బీర్‌పూర్ మండలంలోని క్రీడాకారులకు సౌకర్యంగా ఉంటుంది. మారుమూల ప్రాంతంలో మినీ స్టేడియం ఏర్పాటు జరిగితే జాతీయ స్థాయిలో కొత్త క్రీడాకారులు ఎంతోమంది వెలుగులోకి వస్తారు.

– తేలు రాజు, పెంబట్ల..

పనులు ప్రారంభించాలి



మినీ స్టేడియం పనులను అధికారులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి, మినీస్టేడియం ఏర్పాటు చేయాలని ఐదేళ్లుగా మండలంలోని యువ క్రీడాకారులు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం పనులు నిర్వహించేవారికి సత్వరమే బిల్లులు అందించి పనులు పూర్తి చేసేలా చూడాలి.

– బేర మహేశ్, రేచపల్లి

త్వరలో ప్రారంభిస్తాం

మినీస్టేడియం పనులు త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. సాంకేతిక పనులు పూర్తయ్యాయి. పనులు ప్రారంభించే విషయంపై ఇప్పటికే పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌తో చర్చించాం. సకాలంలో పనులు పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– మిలింద్, పంచాయతీరాజ్ డీఈ

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



భోజనం పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: గురుకులాల్లో కనీస వసతులు కరువై, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే గురుకులాలు సందర్శించి, సమస్యలు పరిష్కరించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ నాయకులతో కలిసి సోమవారం తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వంటగది పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తుంటే కాంగ్రెస్ నాయకులు ఎందుకు అంత భయపడుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జనగం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీలత, పాక్స్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు, చిన్న దుర్గయ్య, అజారొద్దీన్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ధర్మపురి: గుట్ట మలుపు వద్ద తరుచుగా జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి పోలీసులు చర్యలు చేపట్టారు. మండలంలోని ఆకసాయిపల్లె గుట్టమలుపు వద్ద రోడ్లకిరువైపులా తుమ్మ చెట్లు, ముళ్లపొదలున్నాయి. వీటి వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని భావించి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై ఉదయ్‌కుమార్ రోడ్డుకిరువైపులా ఉన్న తుమ్మచెట్లను జేసీబీ సాయంతో తొలగించారు. చెట్లు తొలగించడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు, మూల మలుపు కనిపిస్తుందని దీంతో ప్రమాదాలను అరికట్టవచ్చని సీఐ తెలిపారు.

- **క్రీడలతో మానసికోల్లాసం**

మల్లాపూర్: క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసం కలుగుతుందని మండల విద్యాధికారి(ఎంఈవో) దామోదర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన–విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న గేమ్స్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూమేశ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

- **యూత్ డే సదస్సు పోస్టర్ ఆవిష్కరణ**

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్‌లో ఈ నెల 3న నిర్వహించే తెలంగాణ యూత్ డే సదస్సు పోస్టర్‌ను సోమవారం తెలంగాణ జనసమితి పార్టీ కార్యాలయంలో విద్యార్థి జనసమితి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు జిల్లపెల్లి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ డే సదస్సుకు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ మండల అధ్యక్షుడు కంతి రమేశ్, నాయకులు కాట దశరథ్‌రెడ్డి, తిరుపతి, సోమేశ్, దీపక్, మణిదీప్, గంగాధర్, మనోజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

- **వరి కొయ్యలు కాల్చితే భూసారం క్షీణత**

ధర్మపురి: రైతులు వరి పొలాలు కోసిన తర్వాత వరి కొయ్యలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని ఏఈవో అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాయపట్నంలో సోమవారం వరి కొయ్యలను కాల్చడం వలన జరిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలు కాల్చడం వలన కాలుష్యం పెరుగుతుందని, భూమిలో ఉండే మిత్రపురుగులు, సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. యాసంగిలో సాగుకు అనుకూలమైన వరి రకాల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

- **హనుమాన్ ఆలయంలో చోరీ**

కోరుట్ల: పట్టణంలోని అయోధ్యపట్నంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయంలోని హుండీ పగులగొట్టారు. అందులో ఉన్న సుమారు రూ. 20 వేల నగదు ఎత్తుకెళ్లారని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- **గిరిజన ఆశ్రమ పాఠశాలలో టీచర్లను నియమించాలి**

రాయికల్: మండలం జగన్నాథపూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించాలని ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్సెంగ వేణు సోమవారం ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో వార్డెన్‌తో సహా అందరు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులే ఉన్నారని, ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

- **ముదిరాజ్ యూత్ కార్యవర్గం**

మల్యాల: మండలంలోని నూకపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ యూత్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ యూత్ అధ్యక్షుడిగా రంగినేని బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రాయిల్ల నవీన్, కోశాధికారిగా సబ్బని జలందర్, సలహాదారులుగా గుర్రం అశోక్, సబ్బని రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- **విజయోత్సవాలు విజయవంతం చేయాలి**

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలనా ప్రజా విజయోత్సవాలు విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 వరకూ నిర్వహించే విజయోత్సవాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

- **గల్ఫ్ బాధిత కుటుంబానికి పరామర్శ**

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన దీకొండ సురేశ్ అనే యువకుడు గల్ఫ్‌లో ఇటీవలే మృతిచెందగా, బాధితకుటుంబాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఆమె వెంట నాయకులు ఏజీబీ మహేందర్, సోమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

- **అంత్యక్రియల ఖర్చులు పెంపు**

జగిత్యాల: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మరణిస్తే ప్రభుత్వం ఇస్తున్న అంత్యక్రియల ఖర్చులను రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబరు 247 ద్వారా ఉత్తర్వులుజారీ చేసిందని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తెలిపారు.

- **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

మల్యాల: మండలంలోని కొండగట్టు సబ్‌స్టేషన్ పరిధి, తాటిపల్లి పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగనుందని ఏడీఈ మహేందర్ తెలిపారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ధర్మపురి: ఖాతాదారులకు ఇన్సురెన్సు సౌకర్యాన్ని కల్పిస్తున్న గాయత్రి బ్యాంకు సేవలు అభినంద నీయమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్ అన్నారు. బొజ్జ తిరుపతి అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబానికి మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం బ్యాంకు మేనేజర్ వొజ్జల మోహన్‌తో కలిసి అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన యూత్ కాంగ్రెస్ నాయకుడు

రాయికల్: ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన సాయికిరణ్‌రావు ఇటీవల కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసి, సోమవారం లండన్‌లో ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూర్మాచలం అనిల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ యూత్ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.


అక్షర నిలయాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు

పెగడపల్లి: అక్షర నిలయాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు రూపుదిద్దుకుంటున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి అన్నారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం సుపోషణ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, బాలింతలు, కిశోర బాలికల బరువులు, కొలతలు తీసి బాలామృతం, గుడ్లు, ఇతర పోషకాహారం పంపిణీ చేశారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మహిళలు పాల్గొన్నారు.

మల్యాలలో ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

మల్యాల: మండలంలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు ముగిశాయని ఐకేపీ ఏపీఎం రాజయ్య తెలిపారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 624మంది రైతుల నుంచి 31,516.80 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.7.31 కోట్ల విలువైన ధాన్యం సేకరించామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేసిన నాయకులు

ధర్మపురి: బస్సు సౌకర్యం లేక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికి వస్తున్న నిరుపేద విద్యార్థులకు ఎన్నారైలు సోమవారం సైకిళ్లను పంపిణీ చేశారు. ధర్మపురిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు పేద విద్యార్థులకు ఆస్ట్రేలియాలో ఉంటున్న వసుదేవ కుటుంబానికి చెందిన ఎన్నారైలు విద్యార్థులకు సాయం చేయాలని భావించారు. జగిత్యాలకు చెందిన సాన ఉమాపతిని సంప్రదించి సైకిళ్లు పంపిణీ చేయాలని డబ్బులు పంపించారు. ఆ డబ్బులతో సైకిళ్లు కొనుగోలు చేసి ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్‌తో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెగడపల్లి: మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నిరుపయోగంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా.. మార్కెట్లో ధాన్యం క్రయ విక్రయాలు జరపడం లేదు. ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న ఇతర పంట ఉత్పత్తులను విక్రయించి సొమ్ము చేసుకోవాలంటే దళారులకు లేదా ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చౌడారపు గంగాధర్, ఎంపీడీవో, సారంగాపూర్, సెల్ నంబర్: 9440468508

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

భోజనంలో మెనూ తప్పక పాటించాలి

కోరుట్ల రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఎంపీడీవో రామకృష్ణ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనంతో మెనూ తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటంతో పాటు నీటి నిల్వలు ఉండకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజన్సీ నిర్వహకులు, ఎంఈఓ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన కార్మికులు పరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం హెచ్‌ఎంలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విషయంలో అలసత్వం ప్రదర్శించకూడదని హెచ్‌ఎంలకు సూచించారు. భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఎంఈవో మధు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

రాయికల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని తహసీల్దార్ ఖయ్యూం సూచించారు. పట్టణంలోని బాయ్స్ హైస్కూల్‌లో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థులకు వండే భోజనాన్ని నాణ్యతగా ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాఘవులు, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శ్రీనివాస్, రమణి, మామిడాల శ్రీనివాస్, సీఆర్పీలు రవీందర్, రాజేశ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని రూప్లాషా రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం, ఇన్‌చార్జి ఎంఈవో మధు సోమవారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 3న హైదరబాద్‌లో జరిగే వ్యాసరచన పోటీల్లో ఆమె పాల్గొంటారని పేర్కొంటారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మేడిపల్లి: ఇటీవలే జగిత్యాల జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించి, సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పుప్పాల రచన, చిలివేరి రుచితను భీమారం మండల విద్యాధికారి మధుసుదన్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జవ్వాజి అశోక్, పీఈటీ పెసరి తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై అభినందన..

పెగడపల్లి: పూణేలో జరిగిన జాతీయ స్థాయి ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ 27వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బతికపల్లికి చెందిన 8వ తరగతి విద్యార్థి వడకాపురం జశ్వంత్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం మండల ఎస్సై రవికిరణ్ విద్యార్థి జశ్వంత్‌తోపాటు ఉత్తమ రిఫరీ అవార్డు సాధించిన క్యాస రాజశేఖర్‌ను అభినందించారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్ప పడిపూజలో గురుస్వాములు,భక్తులు

మల్లాపూర్: మండల కేంద్రంలో ఆకుతోట కళ్యాణ్ స్వగృహంలో సోమవారం అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పడిపూజకు గురుస్వామి వినోద్ నేతృత్వంలో వందలాది అయ్యప్ప దీక్షదారులు హాజరవగా, శరణుఘోషతో ఆ ప్రాంగణమంతా మారుమ్రోగింది. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పల్లకీసేవ ఉత్సవాలు

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్‌లో సోమవారం అయ్యప్ప స్వామి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో తరలిరాగా, స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప దీక్షదారులు ఊరేగింపుగా పల్లకీసేవను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సరికెల మహిపాల్, భక్తులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లి శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి ప్రతి సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారని తెలిపారు. ఇకపై ప్రతి నెలా మొదటి సోమవారం ఆలయ కమిటీ, దాతల విరాళాలతో అన్నదానం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన సింగరెడ్డి రాంరెడ్డి–శంకరమ్మ దంపతులు అందించిన విరాళంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.